# భారతదేశ ఆర్థికాభివృద్ధి

## మధ్యయుగ భారత ఆర్థిక వ్యవస్థ

### మొగలాయి యుగం

మొగలుల ఆర్థిక వ్యవస్థ గురించి నాటి శాసనాలు, సాహిత్యం, విదేశీ రాయబారులు, యాత్రికుల రచనలు తెలియజేస్తున్నాయి. సర్ థామస్ రో, బెర్నియార్, ట్రావెర్నియర్, జాన్ ఫ్రయర్, ఫ్రాన్సిస్‌కో పాల్‌సరట్ వంటి వారు తమ రచనల్లో మొగలుల కాలాన్ని వివరించారు.

- మొగలాయి పాలనా విధానాల ప్రారంభకుడిగా షేర్షా పేరొందాడు. షేర్షా ప్రవేశపెట్టిన విధానాలనే అక్బర్, అతని వారసులు కొనసాగించారు. షేర్షా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు. భూమిని సర్వే చేయించి ఉత్తమ, మధ్యమ, అధమ అనే మూడు రకాలుగా విభజించి, పంటలో 1/3వ వంతును శిస్తుగా నిర్ణయించాడు.
- బిఘా- భూమికొలత ప్రమాణం. జరిబానా- భూమికొలత రుసుము. ముహసిలానా- శిస్తు వసూలు అధికారులకు చెల్లించే రుసుము. శిస్తు నిర్ణయానికి షేర్షా రాజ్యమంతటా భూమి విస్తీర్ణాన్ని ప్రాతిపదికగా చేసుకోగా, ముల్తాన్, మాల్వా, రాజస్థాన్ ప్రాంతాల్లో మాత్రం పంట రకాలనుబట్టి శిస్తు నిర్ణయించాడు.
- పరగణాల్లో భూమికి సంబంధించిన మొత్తం సమాచారం కనుంగో వద్ద లభించేది. రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టిన షేర్షా రైతులు సక్రమంగా శిస్తు చెల్లిస్తామనే హామీ పత్రాలను వారి నుంచి పొందాడు. వీటినే కబూలియత్‌లు అంటారు.
- షేర్షా ధామ్ అనే వెండి రూపాయి నాణేలను ప్రవేశపెట్టాడు. బెంగాల్‌లోని సోనార్‌గావ్ నుంచి లాహోర్ వరకు గ్రాండ్‌ట్రంక్ రోడ్డు వేయించాడు. రహదారులవెంట ప్రతి 2 కోసుల (8 కి.మీ)కు ఒక సరాయి (సత్రం) నిర్మించాడు. ఈ సరాయిలు తపాలా ఆఫీసులుగా, మార్కెట్ పట్టణాలుగా కూడా విధులు నిర్వహించేవి. వాటినే కసబాలు అనేవారు.

### రెవెన్యూ వ్యవస్థ

సర్కారుల్లో మున్సిఫ్-ఇ-మున్సిఫాన్ అనే అధికారి రెవెన్యూ విధులు నిర్వహించేవాడు. పరగణాల్లో భూమిని కొలిచి, శిస్తు నిర్ణయించే అధికారి అమీల్. రెవెన్యూ సిబ్బందిపై అజమాయిషీ చేసే ఉద్యోగి కనుంగో. షేర్షా రైతులకు తక్కావీ రుణాలు మంజూరు చేసేవాడు. నాటి ఆర్థికశాఖ మంత్రిని వజీర్ లేదా వకీల్ అని పిలిచేవారు. ఆర్థికశాఖను దివాన్-ఇ-విజారత్ అనేవారు.

- అక్బర్ చక్రవర్తి షేర్షా విధానాలనే కొద్ది మార్పులతో కొనసాగించాడు. అక్బర్ ఆర్థిక మంత్రి లేదా రెవెన్యూ మంత్రి రాజా తోడర్ మల్ సాయంతో బందోబస్త్ రెవెన్యూ విధానాన్ని ప్రవేశపెట్టాడు. దాన్నే జబ్తి లేదా జాబితా పద్ధతి అంటారు.
- అక్బర్ భూమిని సర్వే చేయించి, కొలిపించడానికి జరీబ్ అనే లింకుల గొలుసును వినియోగించేవాడు. సర్వే చేసిన భూములను పోలజ్, పరౌటీ, బాచర్, బంజర్ అనే నాలుగు రకాలుగా విభజించి 1/3 వంతు శిస్తుగా నిర్ణయించాడు. అంతకు ముందు గజంబద్ద స్థానంలో ఉన్న సికిందరీఘజ్, అక్బర్ షాహీఘజ్‌లను తొలగించి 'ఇలాహిఘజ్' అనే కొలబద్దను ప్రవేశపెట్టాడు. వ్యవసాయదారులకు 1584 నుంచి ఇలాహి శకం అనే కొత్త సౌరమాన శకాన్ని ప్రారంభించాడు.
- పన్ను విధింపునకు దహ్‌సాలా (దశవర్ష పద్ధతి)ను ప్రవేశపెట్టాడు. పది సంవత్సరాల సగటు ధరలతో వివిధ రకాల పంట దిగుబడిని లెక్కించి, శిస్తు విధించేవారు. ఒకేరకమైన ఉత్పాదకత ఉన్న పరగణాలను దస్తూర్ అనేవారు. కశ్మీర్, కాందహార్, సింధు, దక్కన్ ప్రాంతాల్లో దశవర్ష పద్ధతిని అమలు చేయలేదు.
- షాజహాన్ కాలంలో భూమి శిస్తు 33 శాతం నుంచి 50 శాతానికి పెరిగింది. శిస్తు వసూలు చేసే హక్కును వేలంవేసి మధ్యవర్తులకు అప్పగించే రెవెన్యూ ఫార్మింగ్ విధానాన్ని అనుసరించారు. జమ అంటే ఒక జాగీర్ నుంచి అంచనా వేసిన ఆదాయం. హాసిల్ అంటే వసూలైన వాస్తవ ఆదాయం.

### భూములు- రకాలు

- మొగలుల కాలంలో ఖలీసా, జాగీర్, మదద్-ఇ-మాష్ అనే మూడు రకాల భూములుండేవి. రాజుకు చెందినవాటిని ఖలీసా భూములు అంటారు. మున్సబ్‌దారులకు, మధ్యవర్తులకు ఇచ్చే వాటిని జాగీర్ భూములు అనీ, పండితులకు ఇచ్చే వాటిని మదద్-ఇ-మాష్ భూములు అనీ అంటారు. వ్యవసాయదారులు, జమీందారుల సొంత భూమిని ఖుద్‌ఖాస్త్ భూములు అనేవారు. జహంగీర్ కాలంలో మొత్తం వ్యవసాయ భూమిలో 1/9వ వంతుగా ఉన్న ఖలీసా భూములు ఔరంగజేబు కాలానికి 1/5వ వంతుకు పెరిగాయి. జాగీరుల్లో మున్సబ్‌దారులకు ఇవ్వడానికి రిజర్వు చేసిన వాటిని పాయ్‌బకి భూములు అనేవారు.
- నాటి రైతాంగంలో మూడు వర్గాల వారుండేవారు. ఖుద్‌ఖాస్త్ రైతులు, పాహీలు, ముజరియమ్‌లు. సొంత గ్రామాల్లో సొంత భూములు, పరికరాల మీద ఆధారపడే వారిని ఖుద్‌ఖాస్త్ రైతులు అంటారు. వీరికి వంశపారంపర్య హక్కులుంటాయి. వీరు తమ

www.eenadupratibha.net

భూములను ఇతరులకు కౌలుకిచ్చి మాలికానా (కౌలు) వసూలు చేసేవారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చి గ్రామంలో కౌలు భూములను సాగుచేసే రైతులను పాహీలు అనేవారు. అదే గ్రామానికి చెంది, భూములు, పరికరాల కోసం ఖుద్‌ఖాస్త్ రైతులపై ఆధారపడే వారిని ముజరియమ్‌లు అంటారు.

✪ నాటి జమీందారుల్లో కూడా మూడు వర్గాలుండేవి. వారిని స్వయం పాలిత జమీందారులు, మధ్యస్థాయి జమీందారులు, ప్రాథమిక జమీందారులుగా పేర్కొన్నారు. మొగలుల రెవెన్యూ విధానానికి వెన్నెముక మధ్యస్థాయి జమీందారులు. వీరికి శిస్తు వసూలుకు వంశపారంపర్య హక్కు ఉంటుంది కానీ, భూములపై ఉండదు.

## ఉత్పత్తులు- వర్తకం

గ్రామీణ ప్రాంతంలో హస్త కళాకారుడి కుటుంబం ఉత్పత్తికి ప్రాథమిక స్థానంగా ఉండేది. హస్తకళాకారులకు కూడా వ్యవసాయమే ప్రధానవృత్తి. నేతపనిని స్త్రీలే నిర్వహించేవారు. వడ్రంగం, నేత, అద్దకం, కమ్మరం వంటివి ప్రధానమైన వస్తూత్పత్తి వృత్తులుగా ఉండేవి. పత్తి, నీలిమందు, నూనె గింజలు ముఖ్యమైన గ్రామీణ ఉత్పత్తులు. వ్యవసాయేతర ఉత్పత్తికి సంబంధించి కుమ్మరం, తోలు వస్తువుల తయారీ ప్రధానమైనవి. దేశంలో పాదరక్షలు, తోలు సంచుల తయారీ బాగా అభివృద్ధి చెందాయి.

✪ పట్టణ ప్రాంతాల్లో భారీతరహా పరిశ్రమలు అభివృద్ధి చెంది, ద్రవ్య ఆర్థిక వ్యవస్థను సృష్టించాయి. నూలు, పట్టు, ఉన్ని, వజ్ర పరిశ్రమలు ఎంతో అభివృద్ధి చెందాయి. బెంగాల్, గుజరాత్, కోరమాండల్ ప్రాంతాలు జౌళి వర్తకానికి పేరొందాయి.

✪ విదేశీ యాత్రికులు దాదాపు 160 రకాల వస్త్రాలను పేర్కొన్నారు. కోరమాండల్ తీరం, గుజరాత్‌లో తయారయ్యే మజ్లిన్, లాంగ్ క్లాత్‌లకు ఆసియా మార్కెట్లో విపరీతమైన గిరాకీ (డిమాండ్) ఉండేది. గోల్కొండ వజ్ర పరిశ్రమకు పేరుగాంచింది. సింగ్‌భమ్‌లో ఇనుము, ఖేత్రిలో రాగి గనులు బయటపడ్డాయి. వస్త్ర పరిశ్రమ ఎగుమతిలో ప్రధానపాత్ర పోషించింది. కశ్మీర్ ఉన్ని వస్త్రాలకు పేరుగాంచింది.

✪ భారతీయ నూలు వస్త్రాలు, మలబారు సుగంధ ద్రవ్యాలు పాశ్చాత్య దేశాలను ఆకర్షించాయి. లాహోర్, ముల్తాన్‌లు గొప్ప రవాణా కేంద్రాలుగా ఉండేవి. బెంగాల్, కోరమాండల్ తీరాల మధ్య సముద్ర వర్తకం బాగా జరిగేది. నూలు, పట్టు వస్త్రాలు, ఆయుధాలు, చక్కెర ప్రధాన ఎగుమతులుకాగా, బంగారు, కర్పూరం వంటివి ముఖ్య దిగుమతులు. నేత, లోహ పరిశ్రమలు ఎంతో అభివృద్ధి చెందాయి.

✪ నాడు పరపతి లేదా రుణ విధానం వడ్డీ వ్యాపారులైన షరాఫ్‌లు నిర్వహించే హుండీల (లిఖితపూర్వక హామీలు) మీద ఆధారపడి ఉండేది.

✪ మొగలుల కాలంలో పట్టణ కేంద్రాలు బాగా అభివృద్ధి చెందాయి. నాడు నాలుగు రకాల పట్టణ వ్యవస్థలు ఉండేవి. ఢిల్లీ, ఆగ్రా వంటి పరిపాలనా కేంద్రాలు, మధుర, వారణాసి, తంజావూరు వంటి యాత్రా పట్టణాలు (కేంద్రాలు), సూరత్, మచిలీపట్నం, సోనార్‌గావ్ వంటి వ్యాపార కేంద్రాలు, బ్రోచ్, బయానా వంటి ఉత్పత్తి కేంద్రాలు పేరుగాంచాయి. కాబట్టే, మొగలుల కాలాన్ని పట్టణీకరణకు స్వర్ణయుగంగా పేర్కొంటారు.

✪ నాడు సూరత్, మచిలీపట్నాల్లో సగటున లక్షకుపైగా జనాభా ఉండేది. బొంబాయి, కలకత్తా, మద్రాస్ వంటి కొత్త ఓడరేవులు ప్రధాన నగరాలుగా వృద్ధి చెందాయి. నాడు ఆగ్రా, వారణాసి - బట్టల ఉత్పత్తికి, సోనార్‌గమ్, ఢాకా పట్టు పరిశ్రమకు, లాహోరు శాలువాలకు, ఫతేపూర్ సిక్రి - తివాచీలకు, సియోల్‌కోట - కాగితం పరిశ్రమకు, బీహార్ - సురేకారానికి, ఢాకా - నాజూకు మజ్లిన్ వస్త్రాలకు ఎంతో ప్రఖ్యాతి చెందాయి. ఢిల్లీ రాగి పరిశ్రమకు, బెనారస్ ఇత్తడి పరిశ్రమకు, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్‌లు పంచదార పరిశ్రమకు, ఢాకా, అహ్మదాబాద్, జాన్‌పూర్ వస్త్రపరిశ్రమకు పేరొందాయి.

## విదేశీ యాత్రికులు- వారి రచనలు

విదేశీ యాత్రికుల రచనల్లో కూడా నాటి ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన వివరాలున్నాయి. సూరత్ రేవు, మొగలుల వాణిజ్య పద్ధతుల గురించి సర్ థామస్ రో వివరించాడు. 'ట్రావెల్స్ ఇన్ మొగల్ ఎంపైర్' గ్రంథంలో బెర్నియార్ అనే ఫ్రెంచి యాత్రికుడు నాటి రైతుల జీవితం, పేదరికం, ప్రధాన ఉత్పత్తుల గురించి రాశాడు. ట్రావెర్నియర్ తన 'ట్రావెల్స్ ఇన్ ఇండియా' గ్రంథంలో గోల్కొండ వజ్రాల గనులు, పంటలు, ప్రజల విచిత్ర ఆచారాలు, కరెన్సీ మొదలైన అంశాల గురించి రాశాడు.

✪ 'భారతదేశం పత్తి పంటలో ప్రపంచానికే నిధి' అని బెర్నియార్ పేర్కొన్నాడు. భారతదేశంలో నీలిమందు పంట పండించే విధానాన్ని ఫ్రాన్సిస్‌కో పాల్‌సరట్ తన 'రిమోన స్ట్రెయిన్టే' గ్రంథంలో వివరించాడు. మొగల్ పాలకులు భవన నిర్మాణానికి విపరీతంగా ఖర్చుచేసినా, ఖజానాలో ఇంకా 20 కోట్లున్నాయని బెర్నియార్ పేర్కొన్నాడు.

✪ జహంగీర్ కాలంలో బొబ్బల ప్లేగు, షాజహాన్ కాలంలో తీవ్రమైన దక్కన్, గుజరాత్ కరవులు సంభవించాయి. షాజహాన్ ఆస్థాన చరిత్రకారుడైన అబ్దుల్ హమీద్ లహరి నాటి కరవు (1630–31) గురించి 'మనిషిని మనిషి పీక్కుతినేవాడు' అని రాశాడు. 'షాజహాన్ కాలం సామ్రాజ్య పతనానికి నాంది' అని స్మిత్, రాప్సన్ వంటి చరిత్రకారులు పేర్కొన్నారు.

★ శివాజీ కాలంలో భూమి శిస్తు 2/5 శాతంగా ఉండేది.

★ మొగలుల కాలంలో సురేకారం అధికంగా లభించే ప్రాంతం - బిహార్.

★ మొగల్ చక్రవర్తులు భవన నిర్మాణానికి విపరీతంగా ఖర్చు చేసినా, ఖజానాలో ఇంకా 20 కోట్లున్నాయి అని తన రచనలో పేర్కొన్నది - బెర్నియార్.

★ బొబ్బల ప్లేగు జహంగీర్ కాలంలో వచ్చింది.

★ మున్సబ్‌దారులకు ఇవ్వడానికి రిజర్వు చేసిన భూములు - పాయ్‌బకి.

★ మొగలుల కాలంలో ఆర్థికమంత్రిని వజీర్ అని పిలిచేవారు.

★ ఒకే రకమైన ఉత్పాదకత ఉన్న పరగణాలను దస్తూర్ అని పిలిచేవారు.

★ జబ్తి లేదా జాబితా పద్ధతిని అమలు చేసిన పాలకుడు - అక్బర్

★ ముల్తాన్, మాల్వా, రాజస్థాన్, ప్రాంతాల్లో షేర్షా రైత్వారీ పద్ధతిని అమలు చేయలేదు.

★ అక్బర్ ఢిల్లీ, అలహాబాద్ ప్రాంతాల్లో శిస్తు రాయితీ ఇచ్చాడు.

## మాదిరి ప్రశ్నలు

**1.** భారతదేశంలో నీలిమందు సాగు విధానాల గురించి వివరించిన విదేశీయుడు ఎవరు?

1) బెర్నియార్ 2) ట్రావెర్నియర్ 3) సర్ థామస్ రో 4) ఫ్రాన్సిస్‌కో పాల్‌సరట్

**2.** మొగలుల కాలంలో ఉన్ని వస్త్రాలకు పేరుగాంచిన ప్రాంతమేది?

1) లాహోర్ 2) ముల్తాన్ 3) కశ్మీర్ 4) మలబార్

**3.** ధామ్ అనే వెండి రూపాయి నాణేలను ప్రవేశపెట్టిన పాలకుడు ఎవరు?

1) షేర్షా 2) అక్బర్ 3) శివాజీ 4) ఔరంగజేబు

**4.** భూమిని కొలవడానికి అక్బర్ ఉపయోగించిన సర్వే సాధనమేది?

1) ఇలాహిఘజ్ 2) సికిందరీ ఘజ్ 3) బిఘా 4) జరీబ్

**5.** అక్బర్ ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?

1) జిలాబంది 2) బందోబస్త్ 3) దహ్‌సాలా 4) అన్నీ సరైనవే

**6.** ఏ మొగల్ చక్రవర్తి కాలంలో భూమిశిస్తు 50 శాతంగా ఉండేది?

1) అక్బర్ 2) జహంగీర్ 3) షాజహాన్ 4) ఔరంగజేబు

**7.** మొగలుల కాలంలో మత సంబంధ వ్యక్తులకు, పండితులకు ఇచ్చిన భూమి ఏది?

1) ఖలీసా 2) ఖుద్‌ఖాస్త్ 3) జాగీర్ 4) మదద్-ఇ-మాష్

**8.** కౌలు రైతులు చెల్లించే కౌలును ఏ పేరుతో పిలిచేవారు?

1) పాయ్‌బకి 2) మాలికానా 3) పాహీ 4) ముజరియమ్

**9.** మొగల్ రెవెన్యూ వ్యవస్థకు వెన్నెముకగా పేరొందింది ఏది?

1) స్వయంపాలిత జమీందార్ 2) మధ్యస్థాయి జమీందార్

3) ప్రాథమిక జమీందార్ 4) ఎవరూ కాదు

**10.** విదేశీ యాత్రికులు ఎన్ని రకాల వస్త్రాలను పేర్కొన్నారు?

1) 140 2) 150 3) 160 4) 20

### జవాబులు

1-4; 2-3; 3-1; 4-4; 5-2; 6-3; 7-4; 8-2; 9-2 ; 10-3.

- బి. నాగరాజు

www.eenadupratibha.net